పల్లెటూరు స్కూలు తణిఖీ తంతు

భమిడిపాటి కామేశ్వరరావు గారు

వెంకటాయిగారు గడ్డిపాలెంలో ఉదర నిమిత్తం బడిపంతులుగా కుదురుకున్న సాధారణుడు. ఆయన బహు సౌమ్యుడు. ఆయనికి స్థిరాస్తి భార్య, చరాస్తి తనే. అతగానికి నమ్మకంగా వచ్చే సాలాదాయం ఏమీ అంటే ఒక ఆడశిశువు; కొండొకచో కవలలు. పైఖర్చుకి నాలుగురాళ్లుకాక, పంటలరోజుల్లో ఊరివాళ్లు వసూలుచేసి అతడికి ముట్టచెప్పే ఇరవై బస్తాల ధాన్యమూ అతని సంసారానికి కొంతకూడు. పంటలు అటూ ఇటూ అయినప్పుడల్లా ఈధాన్యం గురించి జనం లోపల కొంచెం తిట్టుగున్నా ఇస్తూనే ఉండేవారు. ఇది గాక, ఇతరత్రా ఓ అక్షరాభ్యాసం అనో, ఓ దసరా అనో పేరెట్టి అతడు ప్రజల దగ్గిర్నించి ఓ జామారో గట్రో గుంజుకుంటూండేవాడు. పైగా, ఓ దస్తావేజు గోకిపెట్టో, ఓ సంబంధం ముడెట్టించో, ఓ సాక్ష్యానికి తగులడో, ఓ బ్రాహ్మణార్థానికి ఏడిశో దక్షిణ కొట్టకుండా ఇంతో అంతో కతుకుతూండేవాడు. ఇంకా, స్కూలు తణిఖీదార్లలో ఎవడేనా ఒకొక్క తరిపి ఘటం వచ్చినప్పుడు అతగాణ్ణి మనుగుడుపుకి మేపినట్టు మేపి అతని సిఫార్సువల్ల గ్రాంటు కొడుతూండేవాడు. క్రితం ఏడు మాత్రం, పై అధికారి, గ్రాంటు సరిగా పారెయించలేదుట—ఏదో ఒకానొక సప్లయి తృప్తికరంగా జరక్క! ఇన్నిన్ని వీళ్లూ ఉండడంవల్ల అతనికి మరోహ లోటు ఏమీ రాకుండా నిమ్మకి నీరోసినట్టు జరిగిపోవలిసిందేకాని, ఒక్క అసిఘాత వచ్చిపడింది. ఆ పాలెం మొత్తానికి అతనిదే ధర్మలోగిలి. అందువల్ల ప్రతీప్రయాణీకుడూ కుడా వీళ్లింటో ఆగడం సాగించాడు, పొద్దెక్కితే పొద్దెక్కిందనీ, ఎండైతే ఎండనీ, వానైతే వాననీ, మబ్బైతే మబ్బనీ, ఏదైతే అదనీ కారణంగా చెప్పి, తన్ని మెడేసుగుని బలవంతపెట్టగా అవతల తన పన్లన్నీ నిప్పడిపోయినా సరే ఇకబాగుండదని తప్పనిసరివల్ల ఆగిపోతూన్నట్టు నటించి వాళ్లింటో ఆగని బంధువుడూ, తిష్ఠవెయ్యని పరిచయుడూ, బస చెయ్యని బంధుపరిచయుడూ, చెయికడగని పరిచయబంధువుడూ లేడు. అల్లాంటప్పుడు ఖర్చు ఒకరెత్తూ, చాకిరీ దాని పైరెత్తూగా మరీ! పిల్లల చాకరీతో గాక ఈపెద్దల చాకరీతోకూడా ఇంటావిడ తంటాలు పడేది. పోవడం రూఢైతేగాని, రావడానికి మార్గాలు ఏర్పడవు. వెంకటాయిగారు సంసారవిషయంలో వీల్లేక చదువు చెప్పడం విషయంలో మాత్రం కుమ్మరిపురుగులా ఉంటూ ఆర్జనకి ఇంకా అన్యమార్గాలు అన్వేషిస్తూండేవాడు. పక్కఊళ్లో ఎక్కడేనా (అనగా, గడ్డిపాలెం చుట్టూ ఊరగాయి కుండలున్నట్టు అనేక గ్రామాదులున్నాయి) ఎవరేనా కుండ తడుపుకుంటే సరి, అక్కడల్లా ఇతడు హాజరు—కబురు ఏ కాకి చెప్పేదో కాని! ఏదేనా తూతూబాకాగాని, రాండోలుగాని వినిపించితే అదే కన్యాప్రదాతగారి సవినయాహ్వానం, వేరే పిలుపెందుకు! అని వెంకటాయిగారి మతం.

ఒకసారి వెంకటాయిగారి పెళ్లాం పురుడోసుగోడానికి పుట్టింటికెళ్లింది—ఏటేటా ఇదో చిక్కుగా! తొల్చూరుకొడుకు ఒక్కడూ మాత్రం తండ్రితో ఉండిపోయాడు (చదువు చెడిపోతుందని). ఆ తరవాతవాళ్లు అంతాకూడా ఆడపిల్లలే అవడంవల్ల వాళ్లు అయిదారుగురూ తల్లితోనే వెళ్లిపోయారు. దాంతోటి ఇంట్లో గంజికాచి పోసేవాళ్లు కరువయారు. కాని, జనం రావడం మానలేదు. కొన్నాళ్లు వెంకటాయిగారే చెయి కాల్చుగున్నాడు. అయితే తనపెట్టుతోటి తనూ కుర్రపాడగట్టూకుడా దిగనారుకు రావడంవల్ల తన పిన్నత్తగార్ని పదిరోజులపాటు పంపిపెట్టవలిసిందని ఆవిడ కొడుక్కి వెంకటాయిగారు రాయగా రామేశ్వరతీర్థం గంగని కలపడానికి ఆవిడ కాశీ వెంచేసిందని అతడు అప్పట్లో జబాబు రాసి మరి మాసంనాటికి ఆవిణ్ణి పంపించాడు.

ఆవిడ వచ్చింతరువాత కొంపలో హద్దులేని సొద మాత్రం ముదిరింది. వెనకటికి మల్లే ఎవడేనా వీళ్లింటో ఫైటా యిద్దామనుకుని గడపలో పాదం పెట్టేసరికి ఆవిడ వెంకటాయిగారి మీద ఓ టాప్పడవ బూతులు దిమ్మరించేది, లేకపోతే పుత్రాణ్ణి మాటని పిల్చి రుంజా వాయించినట్టు బాదేది. ఆపళంగా వచ్చినవాడు తారెత్తి నిష్క్రమిస్తూండేవాడు. కాని, మరో గ్రహచారం! ఎవరు మాట్లాడుతున్నాసరే ఆవిడ వినిపించుకోదు. పైగా, ఆవిడ వచ్చిన రాత్రిరే ఊళ్లో ఒక పెళ్లి ఊరేగింపుకి అవుట్లతో బాణాసంచా కాలుస్తూంటే, "ఇదేమిటి? ఇంత పొగ ఎక్కడిదో!" అని ఆవిడ ముక్కుమీద వేలేసుకోడాన్నిబట్టి, ఆవిడకి ఏమాత్రమో కొన్నివీసాలు చెముడు కుడా ఉన్నట్టు వెంకటాయిగారు గ్రహించాడు. గ్రహించి, ఆవిడ ఎవర్నేనా పట్టుకు దులిపేటప్పుడు తనే నోరు నొక్కుగుని, ఊరుకోమని, ఆవిడకి సంజ్ఞచేసేవాడు. సంజ్ఞలు చేస్తే చెమిటివాళ్లు కంట్లో పడతారు. అందుకని అల్లాంటప్పుడు ఆవిడ గట్టిగా, "నాకేం? నీ నోరే నొక్కుస్తా! ఎల్లాగైతేం, చేశావు బోడి ఉద్యోగం, మా అమ్మాయికి ఒక్కనగేనా పెట్టలేక పోయావు!" అని అరిచేది. "కొంపలో ఇదో తంపి కుడా వచ్చి పడిందేమిట్రా ప్రభో" అనుకుంటూ వెంకటాయిగారు స్వహస్తపాకం చేసుగునే నాటి కంటే కూడా చిక్కి సహాయాడు.

మరికొద్దిరోజుల్లో పక్కఊరైన నందిపిల్లిలో వివాహం అయింది. కర్మంజాలక వీరికి పిలుపుకూడా వచ్చింది. నడిచే త్రాణలేక వెంకటాయిగారు "పోనిస్తాదాం తగలేసిన భోయినం" అని చాలాభాగం విరక్తి తెచ్చుగుని మానేసెయ్యాలని అనుకున్నాడుగాని ఆవిడ "వెడితేవెళ్లు, లేకపోతే మాను. వెడితే నాకేమీ పుష్టి లేదు, లేకపోతే నాకేమీ నష్టిలేదు. చచ్చినాసరే నేను ఈవాళ బియ్యమూ పొయ్యను పప్పూవెయ్యను" అని కేకట్టింది. పాపం. వెంకటాయిగారు ఎనిమిదింటికే స్కూలుకట్టేసి (ఇనస్పెక్టరు కొత్తవాడొచ్చాట్ట, వాడెల్లాంటి వాడో గదా అని మనస్సులో కొంత ఫికరగా ఉన్నా) కొడుకుని వెంటేసుగుని నందిపిల్లికి అడ్డం పడ్డాడు.

ఆవేళే రెండుజాములు తిరిగింతరువాత ఇద్దరు మనుష్యులు గడ్డిపాలెంలో ప్రవేశించారు. ఒకడు, కొన్ని కాగితాలూ గొడుగూ చంకని పెట్టుకుని భంట్రోతుకి మల్లే తొందరగా ముందు నడుస్తూంటే, రెండోవాడు బుట్టతల పాగా చుట్టి, పిల్లినడక అభినయించి, తల టెక్కించి, అంగలువేస్తూ వెంబడించాడు. ఆయన నడక యొక్క మాంద్యానికి ఒక కారణం దర్జా అయి ఉంటుంది కాని, అంతకంటె బలువయినకారణం బొజ్జ. ఈ చివర లక్షణంతోటి ఆయన సరిగ్గా మూడుమూర్తులా స్కూళ్లతనిఖీదారులాగ ఊరుకున్నాడు. ఊళ్లో చాలమంది హడలిపోయి పగటి మతాబాలు కాలుస్తూ వీధులో నిలబడి ఉండగా, వాళ్లని దర్యాప్తుచెయ్యడంలో మేష్టరుగారు గ్రామాంతరం వెళ్లడం గ్రహించి, వాళ్లు తిన్నగా స్కూలు భవనందగ్గిరికి దారెట్టి, దాని సింహద్వారం తలుపు ఉతగయెత్తి పారేసి లోపల ప్రవేశించిన మీదట భంట్రోతు మాత్రం ఇవతలికివచ్చి మేష్టరుగారిఇల్లు అడిగి కనుక్కొని ఆయనా పిల్లాడూ నందిపిల్లి భోజనానికి వెళ్లడపుసంగతి ఆ చెమిటమ్మగారి దగ్గిర్నించి కొన్ని పావుగంటలలో కమ్మెచ్చులాగి పుచ్చుగుని, ఒకకూలివాడిచేత ఆ ఊరు కబురు పంపించి, తను మళ్లీ స్కూలుభవనంలోకి వెళ్లిపోయాడు. ఊళ్లో పెద్దలుకొందరు చొరవచేసి లోపలికెళ్లి ఆ అధికారితో అనవసరపు సంభాషణచేస్తూ కూచున్నారు.

మనిషివాడు చావంతపని జరిగి నందిపిల్లిలోపడి పందిరివేసి ఉన్న ఒక ఇంటిదగ్గిర ఆగేసరికి అప్పుడప్పుడే బ్రాహ్మలు ఇవతలికివచ్చి త్రేణుస్తూ చేతులు కడుక్కోడంలో మేష్టరుగారు కూడా తనచేతికి ఏమాత్రమో జిడ్డుపట్టుకోగా తన బిరుసుగడ్డం వరహాకట్టెలా ఉండడం వల్ల వేళ్లు గడ్డాన్నెట్టి పాముతూ పక్కాయనతో, "పర్రాయి ఇంటో విస్తరివేసేటప్పటికి ఎంతమొర్రో అంటూన్నా నెయ్యి కాస్త ఎక్కువగా పడితీరుతుందిస్మండి. జిడ్డు వదలటంలేదు!" అంటూ ప్రసంగంలో ఉండగా

మనిషివాడు ఆయన్ని సమీపించి, "వదల్తుందండి. ఇనపమేష్టారు వచ్చారండి. తమర్ని యెంటనే దయ్ సెయ్యమన్నారు" అన్నాడు. "ఓరి నీ యినుం కాల్చా! వచ్చింది మాసికంగారా, కాళ్లుకడగడం గారా? ఈ మధ్య మాసికంగారు మారి కొత్తవాడు కూడా వచ్చాడన్నారు! అతనొక్కడేనా వచ్చింది? పెళ్లాంపిల్లలూ కూడా రాలేదుకద, నాలుగెడ్లబండీ చేసుకుని? అతడేమీ ఖాళీబస్తాలూ, ఖాళీడబ్బాలూ వేసుకురాలేదు కద?" అని మేష్టరు కనుక్కున్నాడు. వాడు సమాధానం చెప్పకుండానే ఇందాకటి పక్కాయన, "అయ్యా, మాసికం, కాళ్లుకడగడం అంటున్నారేమిటి? తెగతిని పెళ్లిపందిట్లో ఇవేం కూతలు మీ శ్రాద్ధపుకూతలు.?" అని కొద్దిగా కూకలేస్తూ హెచ్చరించాడు. తను మేష్టరుగనుక అవన్నీ పడితీరాలి అనుకొని గావును వెంకటాయిగారు అవన్నీపడి, "అయ్యా! నూక్కళ్ల పెద్దతణిఖీదార్ని మేం తద్దినం అనీ, తరవాత ఆయన్ని మాసికం అనీ, మరీ మైనరుతణిఖీదార్ని కాళ్లుకడగడం అనీ సంభాషణలో చెప్పుగుంటుంటాం. తద్దినపుబాధ అస్మదాదులైన అల్పులకి లేకపోబట్టి నేను పైరీతిగా ప్రశ్నించాను. వారు మాకు పిత, పితామహ, ప్రపితామహ లాంటివారు. ఇదీ సంగతి!" అనిచెప్పి, "కుర్రాడా, పదరోయ్?" అని కేకేసి పైమీది కొల్లాయి నడుంకి పట్కాలాగ బిగించి, అమాంతంగా ఎగడి, "ముందు సూచించకుండా వచ్చాడు, ఈకొత్తవాడికి ఇదోరోగం గావును" అని అనుకుంటూ ఉడాములమీద స్వగ్రామం జేరుకుని, పరిగెత్తే అవస్తలోనే బొట్టు గిల్లేసుకుని, జుట్టు రక్కేసుకొని, తమ యింట్లోకి అడుగెట్టి "గార్లొండి వంటకానీవమ్మోయ్!" అని పిన్నత్తగారి చెవులో ఉరిమి, బయటికి ఉరికి, తెంపుగుని పడ్డట్టు నూక్కళ్లోకి దూకి, ఆ బొజ్జాయనే అధికారి అయి ఉంటాడుగదా అనుకుని, ఆయన పాదపద్మసన్నిధిని గాళుపుకొట్టి గుడ్లు తేలేసి నోరువెళ్లబెట్టి కర్రలా బిగుసుకుపోయినట్టు పడిపోయాడు. ఈ అల్లరంతా నిజమే అనుకుని నలుగురూ పోగై, "క్షణంలో వచ్చేది తెలియదుగదా!" అంటూ జాలిపడి ఓ పెద్దచెంబుడు చన్నీళ్లు వెంకటాయిగారి మొహంమీద చరిచి, ఓత్తవ్వగిన్నెడు వేడిగంజి లోపలికి ఎక్కించగా, అప్పటికి ఆయన కాస్త కళ్లువిడది, పెదవికదిపి, అధికారికేసి తిరిగి, "అయ్యా—తమరు—నందిపిల్లి—దార్ని—వస్తున్నారని—తెలిసి—అల్లా—వెళ్లి—" అని చెయ్యి ఊపుతూ, "ఏమైతేం? క్షమించాలి!" అని గొణగగా, అధికారి నిజంగా అతడు గాళుపుదెబ్బ తిన్నాడనుకుని, "ఓ యెస్, క్షమించాను లెండి. ఎండగదా ఎందుకొచ్చిన శ్రమ మీకిది? మేం రామూ? బండీ పంపలేదని కోపగించే బాపతు కాదు మది! ఫర్వాలేదు లేవండి!" అని అభయం ఇచ్చిన మీదట వెంకటాయిగారు లేచి, "తమకు వేళదాటింది. దొరువుదగ్గిర ఒళ్లుతడుపుగుని మడిగట్టుకోండి" అని ప్రార్థించగా, ఆయన "అట్లానే, కాలకృత్యాలు అయినాయి. ఇక లేవడమే. మా ఆలస్యం లేదు. కాని, నా కోసం తెగశ్రమపడి ఎక్కడలేనివీ పుట్టించుగొచ్చి విశేషయత్నంచేసేరు గనక! ఒక్కటే వద్దు. ఈపక్కఊళ్లో — ఏవదీ? (అని కళ్లుమూసుగుని) దేవుడు చాలా మేలుచేస్తే, గోకారం! (కళ్లుతెరిచి) గోకారంలో నాకు పెట్టిని భోయినం ఏంభోయినమండీ! నాలుగు కూర్లు, నాలుగుపచ్చళ్లు, క్షీరాన్నం, మామచక్రాలు, అబ్బ, అబ్బ! యధావిధి, యధావిధి! అయితేం, నేను ఆదినించీ ఇంత జఠరాగ్ని జీర్ణపుష్టీ ఉన్నఘటాన్ని గనక ఆట్టే చిక్కులేక పోయింది. మరో నాదారిస్వరూపం అయితే ఈపాటి టిక్కట్టు పుచ్చుకోవలిసిందే. సరే, త్వరగాకానీండి. నేను ఉండలేను" అనగా, "చిత్తం. పచ్చడీ మెతుకులూనండీ, నాకేముందీ, కుటుంబీకుణ్ణి, రండి" అంటూ వెంకటాయిగారు అధికార్ని తిన్నగా తనఇంటికి తీసిగెళ్లి, ఆయనమొఖం ఇంకా ఏదో ఆలోచనలో ఉన్నట్టు కనిపెట్టి, "వస్తా" అని ఆయన దగ్గిర ఒక్కమాటు సెలవుపుచ్చుగుని, "అబ్బాయి, పంతులుగారికి తుంగచాప వెయ్యి, చూస్తావేం?" అని కుర్రాణ్ణి కసురుగుని, లోపలికివెళ్లి, ఒకపావుగంట తరవాత ఒక గిన్నెపట్టుగుని పైకివచ్చి, "వంటాలస్యం ఉందండి ఒక్కక్షణం. ఈ,లోపులో తమరిది స్వీకరించాలి!" అని అది అక్కడపెట్టగా, అధికారి "మీకేమన్నా మతి చలించిందా ఏం?" అని గట్టిగా కోపపడి, వెంటనే "ఏం

తెచ్చారేమిటి? ” అని నిమ్మళంగా కనుక్కున్నాడు. “అబ్బే,ఒక నేరుపాలు—మట్టిఊడలంటివి—మరగకాచి, ఇంత మిరియప్పొడీ పటికె పంచదారచూర్ణమూ రంగరించానండి. మంచిపని చేస్తుంది. ఇదివరకాయన ఇదంటే చెవికోసుకునే వారు. మరోహమాట చెప్పకండి, పుచ్చుగోండి” అని మేష్టరు పట్టుపట్టగా, అధికారి అతి సిగ్గుతో అయిష్టంగా (విషంపుచ్చుగుంటూన్నట్టు అభినయిస్తూ) నిమిషంలో గిన్నెలో తడేనా లేకుండా ఊడి చేసి, పిదప నాలుగైదు నిమిషాలు కళ్లుమూసుగుని ఆయాసంనటించి, కళ్లుతెరిచి, “అబ్బ!” అని,

అ—అయితే పంతులుగారూ!

వెం—చిత్తం!

అ—వంటాలస్యం ఉండనే ఉంది గనుక, ఈ లోపున పోనీ నేను తలంటు అభ్యంతరం తీర్చుకుంటేం?

వెం—(మనస్సులో, “నాదుంప తెంపు,నీమొహం తగ......”అనుకుంటూ.) ఓ మరీ మంచిదీ! తమ ఓపిక! మంగల్ని పిలిపిస్తాను! అబ్బాయి, ఇల్లారా! (కుర్రాడు వస్తాడు)

అ—మంగలి ఏం లాభం ! అంటుకునే వస్తువు లభ్యంకానప్పుడు?

వెం— ఏవస్తువు?

అ—ఆవునెయ్యి! నేను గోఘృతంతోగాని అభ్యంగనం చెయ్యను. అల్పులు వాడుకునే తైలాలకి మెదడు మెత్తగవాసన! నా మెదడు కొనుక్కోవాలని పెద్ద పెద్ద కంపెనీలవాళ్లు, తన్నుకుంటున్నారు!

వెం—ఎవరుతన్నుకున్నా, సాయంత్రం ఊళ్లో కనుక్కుని కాస్తకాస్తే పోగుచెయ్యాలండి.

కుర్రాడు—అమ్మకి పురుడొచ్చిన తరవాత తాతయ్యగారిఊరు పంపడానికి ఓ శేరు ఆవునెయ్యి కొన్నావుగా నాన్నా! ఇంట్లో ఉంటేనే లేదంటావేం?

వెం—(కుర్రాణ్ణి చేగోడీ నమిలినట్టు నములుదాం అని మనస్సులో అనిపించినా పైకి నవ్వుతూ) మర్రోచ్! ఇట్టే మరిచిపోయాను!(అని అధికారికేసి తిరిగి) మావాడికి, పాతాలుతప్ప కడంవి అన్నీ హృత్కవిలిగా జ్ఞాపకం ఉంటాయండి, మీ ధర్మమా అని.

అని ఇంట్లోకివెళ్లి, నెయ్యితెచ్చి, మంగల్ని పిలిపించి, అధికార్ని తలంటుకి కూచోపెట్టి, దొరువునీళ్లు తెచ్చి, నీళ్ల కింద మంటచేసి, నీళ్లు ఆయన కోరినన్నీ చాలింతరాలికి పోసినట్టుపోసి, ఆయన క్షేత మొత్తానికి మడి కట్టించాడు.

ఈలోగా, అడక్కుండానే కుర్రాడు చెప్పిన మాటలవల్ల వంటచేసే ఆవిడ పేచీమనిషి అనిన్నీ, తన ఘ్రాణేంద్రియ సాహాయ్యంవల్ల తయారవుతూన్న పిండివంటల స్వభావమున్నూ అధికారి పసిపట్టి, పొట్ట నాసుకుపోకుండా బట్ట కొంచెం వొదులుచేసుగుని వీధి అరుగుమీద పచారు చేస్తున్నాడు. వెంకటాయిగారు వచ్చి, “పీటా అదీ వేశారు, రండి” అని అధికార్ని పిలిచాడు “మనికి, అల్లాంటివిలేవు వడ్డించెయ్య మనండి” అని అధికారి వడ్డనకి హుకుం ఇచ్చాడు. మేష్టరు మళ్లీ లోపలికెళ్లి ఒక్కక్షణంలో పైకొచ్చి, “వడ్డనఅయిండి, రండి” అని అధికార్ని లోపలికి తీసుగువెళ్లేసరికి, అధికారి నిర్జీవుడైపోయినాడు. అనగా, మరేంలేదు, విస్తరికేసి చూసేసరికి గుండె ఝల్లుమని పోయింది. దాల్లో, బకాసురుడికి తోడినట్టు కుంభంమట్టుకు తోడి ఉంది. దాని అగ్రమందు — సార్వా గడ్డికొంపమీద కొండముచ్చుమొహంలాగ—వెక్కిరిస్తూ ఉస్తికాయంత ఉసిరీ పచ్చడి ఉంది. అధికారి, అంతమనిషీకూడా, వట్టి పాకం చలిమిడి అయిపోయి ఆపీటమీద కూలబడి, మరోటేమీ అనలేక “మీరో మరీ! ” అన్నాడు. వెంకటాయిగారు, “నేను తరువాత కానిస్తానులెండి, ముందు తమరుపుచ్చుగోండి ప్రొద్దుపోయింది. ఏమీ ఆట్టేచెయ్యలేకపోయాం. నిమ్మళంగా కూచోవాలి. కావలిసినవి నాతో చెప్పి వడ్డించుకోండి, ఆవిడికి చెముడు” అని మనవి చేసుగున్నాడు. అధికారి కళ్లనీళ్లతో పరిషించి, విస్తరి చూపిస్తూ, “ఎల్లా నేనిది ఏడవడం? ” అన్నాడు. తక్షణమే, వెంకటాయిగారు, నిరుడు తనకి తక్కువగ్రాంటు మాత్రమే రాగలదని పైనించివచ్చిన ఆర్డరుకాగితం తెచ్చి అధికారి మొహంమీదపెట్టి, “నేనెల్లా ఏడవడం ఇదీ! ”

అని ఒకొక్క అక్షరమే ఉచ్చరించాడు. అధికారి ముక్కుమీద (ఎడంచేత్తో) వేలుపెట్టుకొని, "ఇదివరకు వాడికి ఏకదాహంట, నేనూవిన్నా. అది తీరక చాలా చోట్ల ఇల్లానే చేశాట్ట. నేను గ్రాంటు కురిపిస్తాను చూడండి, అన్నం పట్టుకు చెబుతున్నాను !" అని వెంకటాయిగారిని సముదాయించాడు. "అల్లాయితే రానీ వమ్మా రానీ! ఆ పెద్ద విస్తరి ఇల్లా పెట్టు!" అంటూ వెంకటాయిగారు ముసలమ్మకి సంజ్ఞలు చెయ్యగా, ఆవిడ వేసివున్న విస్తరి పట్టుకుపోయి, తాజావిస్తరి తెచ్చి పెట్టింది. అధికారి మొఖవికాసంతో దంత పరిశ్రమ చేస్తూ రంగంలో ప్రవేశించాడు. నేతిగిన్నె పక్కనే ఉండడం ఇంటిదగ్గర అలవాటని ఆయన చెప్పడంవల్ల, వెంకటాయిగారు ఆవిడచేత అల్లా చెయించడమేకాక, దొన్నెకుట్టివేసి, అందులోకూడా ఆద్యం ఉంపించాడు. చిటికెలో అధికారి, గారెల పర్వంలోకి వచ్చాడు. మొదట్లో, ఆవిడ రెండు పుంజీలుమాత్రమే వడ్డించింది. అవి జమిలిగాతింటూ, అధికారి,బొజ్జ ఎడంచేత్తో నిమురుకుంటూ,

అ—అబ్బ! ఏమిటో అనుకుంటాంగాని, భోజనం చెయ్యడంకూడా కష్టమేనండి.

వెం—అడ్డమా! నా ఉద్దేశంకూడా అంతేనండి. నింపాదిగా కూర్చోండి. తమకు తెలియని దేముందీ! కోటి విద్యలూ కూటికొరకే!

పదపడి, ముసిలావిడ పళ్లెంతో గార్లు మారుతెచ్చింది. వేగినవి వడ్డించమని ఆవిడతో చెప్పమని అధికారి (అంగాస్త్రంపెట్టి ఎడంచేత్తో ముక్కుతుడుచుకుంటూ) కోరగా, వెంకటాయిగారు తనవేలితో పళ్లెంలో వేగిన గారెలున్న భాగంచూపించి, ఆ ప్రాంతానివి వడ్డించమని ముసలమ్మకి సంజ్ఞచేశాడు. వేగనవి ఆపళ్లెంలో మరో ప్రాంతాన్ని ఉన్నాయని తన తాత్పర్యం అయినట్టుగా, ముఖంచిట్లిస్తూ అధికారి అ భాగం చూపించాడు. వెంకటాయిగారు తనమాటే నెగ్గాలని తను మొదట చూపెట్టిన చోటే మళ్లీచూపించాడు. ముసలమ్మకి ఈయొక్క వయినం బోధపడక, ఇవీ, అవీ, మరి మిగిలినవీ కూడా అధికారి విస్తట్లో బోర్లించి, పళ్లెం వెంకటాయి నెత్తి నెట్టికొట్టి "సత్రంబొక్కు జంతువుల్ని తీసుగురావద్దని ఎన్నిమాట్లుచెప్పినా సిగ్గులేదు. మర్యాదట! తెచ్చి తెచ్చి ఎవణ్ణో సర్వభక్షకుణ్ణి తెచ్చావు! కుర్రాడికి ఒక్కటేనా లేదు. వాడికోసం మళ్లీవండి తగులడాలి!" అని సాదిస్తూ వంటింట్లోకి తుర్రుమంది. అధికారి, "ఈమెకి ఇంత కోపం ఏమిటండీ! నేనుగనుక సరిపోయింది. మరోళ్లయితే తక్షణం లేచిపోదురీపాటి! బాగానే ఉంది. మీకు దెబ్బ తగల్లేదుకద!" అని వెంకటాయిని ఓదార్చి,నిశ్శేషంగా గార్లపుచ్చుగుని, "మజ్జిగ అక్కర్లేదండి" అన్నాడు. వెంకటాయిగారు చాలా నొచ్చుగుని "అయ్యో కర్మమా! కోపంవచ్చినట్టుంది. మీ రేమీ అనుకోకండి. ఆవిడ స్వభావమే అంత!" అన్నాడు. అధికారి "అందుకోసం కాదండి. గార్ల తరవాత పెరుగైనా సరే చేదే." అని లేచి చెయ్యికడుక్కుంటూనే డ్రెస్సు వేసుకోబోతూ "ఇక మనం బళ్లోకివెడదాం. పిల్లల్ని పిలుచుకురండి. మీ కుర్రాణ్ణి ఇంతలో భంట్రోతుకి అన్నంపెట్టమనండి" అన్నాడు. వెంకటాయిగారు "చిత్తం" అని లేచి కోటు తొడుక్కొని పిల్లలకోసంవెళ్లాడు. కుర్రాడు భంట్రోతుకి పీటవేసి వడ్డన ప్రారంభించాడు. అధికారి కోటుతొడుక్కుని, గుండీలు పెట్టుగుని, తలపాగా పెట్టుగుని "బాబోయ్!" అని కవ్వునికేకెట్టాడు. "ఏమిటి! ఏమిటి" అని భంట్రోతు అడిగాడు. "తేలు తేలు! తలంతాఅంట పొడిచింది. పాగాలో ఉంది గావున బాగా నొవ్వకుడుతోంది." అని కళ్లు బిగించి మూలుగుతూ ఉరుకున్నాడు. తరువాత భంట్రోతు చెప్పిన మీదట ఆయన పాగా తీసి దులపగా కప్పంత తేలు రాలింది. చెప్పుచ్చుగు కొట్టి కుర్రాడు చంపాడు. చంపి,"మా నాన్నదగ్గిర ఉల్లిపాయితో చేసిన తేలుమందు ఉందండి" అని ధైర్యం చెప్పాడు. "అది ఒకవేళ వెల్లుల్లిపాయేమో నాకు సయించదు. నేనే సుగోను కుర్రాడా!"అని అధికారి డోక్కోడం ప్రారంభించాడు. భంట్రోతు కరువో కాలమో అన్నట్టు అన్నం అంతా రెండు ముద్దల్లోలాగుతూ, అధికారితో, "భయంలేదండి, అయ్యగారు! తలమీద కట్టడం వల్లమరిపైకి ఎక్కడానికి వీల్లేదు. తమరు వేపపుల్లా,

గారెలాంటి వస్తువులు వాడతారు గనుక ఆ చేదుకి తేలు కాటు లోపలికి అసలు ఎక్కదు. మందు అనవసరమండి" అన్నాడు. వాడి తిండి అవుతూనే ఇద్దరూ స్కూలుకి పరిగెత్తారు. మేష్టారబ్బాయికూడా వెనకాలే వెళ్లాడు. మరి కాస్సేపటికి కొంతమంది కుర్రాళ్లని వెంటబెట్టుగుని మేష్టారు స్కూలు జేరుకున్నాడు. అధికారి పొట్ట వొదిలి తలపట్టుగని ఆపసోపాలు పడుతున్నాడు.

మే—అదేమిటండి?

ఆ—తేలండీ!

మే—ఎక్కడా?

అ—తలమీద.

మే—మందు తెస్తునా?

అ—వద్దండీ. ఇప్పుడు టైము లేదు. అసలు పని పాడవుతుంది మందేస్తూ కూర్చుంటే!

అని మూలుగుతూనే "చూడండీ! మేష్టారు!"

మే—చిత్తం!

అ—ఈవేళ శుక్రవారం. నేను రాత్రి అన్నం తినను.

మే—దయచేసి చెప్పండి, ఏం తింటారో!

అ—ఇందాకటివే అయిదారు పెరుగులో పార యించమని ముసలమ్మకి కబురు పంపండి.

మే—(తేలయేది జెట్టియేది ఆ మినప దిబ్బ మీద వీడి ఏవ అల్లానే ఉంది అని మనస్సులో అనుకని) అవశ్యం!

అని తిట్టుగుంటూ కుర్రాణ్ణిపంపించాడు. వాడు ఇట్టేవెళ్లి చక్కావచ్చాడు.

అ—మేష్టారూ! నాకు బాధగా ఉంది! సంగతి త్వరగా తెమల్చండి!

మే—తమ చిత్తం! నాలో ఏముందీ!

అ—సరే! స్కూలంతా సరిగ్గా ఉన్నట్టేనా?

మే—చిత్తం.

అ—హాజరు పట్టీ, వగైరా, అన్నీ! (అని మూలుగుతాడు).

మే—చిత్తం.

అ—అయితే, తమరు కాస్త తలపాగాయేనా కుడా లేకుండానే వచ్చారేం?

మే—మీకు చాదస్తంగాని, మాపరమటింట్లో చిలక్కొయ్యమీ సిరండి వెళ్లి! దాన్ని గుమ్మడిపండు లాటి ఇస్త్రీమడత తలపాగా నాది ఉందో లేదో తమకు బోధ పడుతుంది! లేదనే మీ ఊహ?

అ—హాజరు పట్టీలో ఉన్న పేర్లేనా ఇప్పుడొచ్చిన వాళ్లవి?

మే—మీకు వెర్రిగాని, కానివాళ్లుంటే నేను వీధులోనే పంపించెయ్యనూ!

అ—సరే, వీళ్లు ఏయే క్లాసులు?

మే—అందరికీగూండా ఏక మొత్తాన్ని గట్టిగా చెప్పడమేగాని, క్లాసులంటో భేషజం నే ఎరగను. అక్కడికీ, అదుగో ఆ మగ్గురూ పైక్లాసు. ఈకడం వాళ్లంతా కిందిక్లాసు!

అ—పైక్లాసు వాళ్లకి కూడా పుస్తకాలు లేనట్టున్నాయేం?

మే— ఈ మధ్య పెళ్లి ఊరేగింపుకి పాలెం అంటుగుందండి. అప్పుడవి కాలిపోయి ఉంటాయి.

అ—సరే. అల్లాయితే నేను కాస్త లోకజ్ఞానం పరీక్ష చేస్తాను. మీరు తప్పుగోండి. (అని కొంత మూలుగుతాడు. పిల్లలు కొంచెం నవ్వుతారు.)

మే—చిత్తం.

అ—ఏయ్! విభూతి కుర్రాడు! మీ ఇంటి పేరు?

వి—గడ్డిల్లు.

అ—నీ కన్నేళ్లుంటాయి?

వి—పెద్దవాళ్లనికనుక్కోవాలి.

అ—నేను పెద్దవాణ్ణేనా?

వి—అవునండి.

అ—ఎంచేత?

వి—మీకు బొజ్జ ఉందిగా!

అ—("విషయం మార్చి ప్రశ్నలు వేస్తే అసలు మాట్లాడరేమో వీళ్లు" అని మనస్సులో అనుకుని) తర వాతవాడు! బొజ్జ ఎల్లా వస్తుంది?

త—గార్లు తింటేనండి.

అ—(మేస్టరు కేసి చూసి) మీ స్కూల్లో అఖంకు లున్నారే!

మే—చిత్తం తమ దయ!

అ—మూడో వాడు! బూర్లు తింటే మాత్రం రాదూ?

మేష్టారి అబ్బాయి—(అడక్కుండానే) ఆవడ లు తిన్నా వస్తుందండి.

అ—(కోపంతో) ఎవరండీ, ఈ పిల్లవాడు! మా చెడ్డవాడూ!

మే—చిత్తం. క్షమించాలి. మా వాడేనండి.

అ—ఓహో! అవునండోయి. అయినా సరే అడక్కుండా సమాధానం చెప్పకూడదు. నేను కనక సరి పోయింది, క్షమించాను. (అని మూలిగి) నాలుగోవాడు! బొజ్జ యెందుకు?

నా—బండి యెక్కడానికండి!

అ—ఛీ! అయిదోవాడు!

అయిదో—పెద్దపెద్ద కోట్లు కుట్టించుకోడాని కండి!

అ—ఛీఛీ! ఆరోవాడు?

ఆ—ఆయాసంగా ఉంటూంటే చేతులు జేర వేసుగోడానికండి!

అ—టట్! అవేవీకావు. అంపర్ని కడుపులో పెట్టుగోడానికి. చాలు కాని, ఈ పుస్తకం తీసుకో! పైక్లాసులో మొదటివాడు! ఎక్కడేనా తీసి వాచకం కానీ!

మొ—(ఎదో తీసి) "ఆ ముని అంతట..."

అ—"ముని" అంటే ఏమిటి, రెండోవాడు!

రెం—మనిషండి.

అ—మరి నేను మునినేనా?

రెం—కాదండి.

అ—ఏం చేత?

రెం—"ముని" అంటే మంచి మనిషండి.

అ—అక్కడితో ఆగు! మూడోవాడు! నువ్వు ఉత్తరం చూపెట్టు!

మూ—ఇంటిదగ్గర ఉందండి.

అ—ఉత్తరపు దిక్కు తోకపోవడవేమి టిక్కడా. (అని పళ్లుబిగిస్తాడు).

మూ—అదాండీ! (అని ఇంటికప్పు చూపిస్తాడు)

అ—ఎవ డాచెప్పింది?

మూ—మా అన్నయ్యండి, మొన్న సెలవలకి వచ్చి మ్యాపులో చూపించాడు.

అ—విన్నాంగాని, మేష్టారూ, తమరు కొంచెం గజ్జికట్టండి, విందాం.

మే—చిత్తం! తమకు బాధ తగ్గిందాండి!

అ—చీత్తం! నాగోడవెందుకు, తమరు ఉపక్ర మించండి!

మే—ఎంతమాటన్నారు! అల్లానే. బాలులారా! (అని గొంతుకసర్దుకుని) సూర్యుడు భూమిచుట్టూ గిరగిర గిరిగిరా తిరుగుచున్నాడు.

అ—అదేమిటయ్యా; అబద్ధాలూ!

మే—ఆ మాటకొస్తే మీరు చెప్పండిచూస్తాను! ఏం ఎక్కువచెబుతారో మహా! ఇందాకణ్ణించి విన్నాగా నేనూను!

అ—స్మృతిమీరి మాట్లాడకండి!

మే—అయ్యా, పిల్లలుగలవాణ్ణి! పెద్దలనాటి నించీ ఇంతే! పైగా నాకు సర్వీసు అయిపోతోంది. ఇహ తప్పుగోమని ఊళ్లోవాళ్లూ అంటున్నారు. (కోపంగా) పైన మీచిత్తం!

అ—పిల్లలుగలవాడవైతే మాత్రం, తల్లకిందులు చదువా చెప్పేది?

మే—మనవిచేశాగా! అల్లాయితే బాలులారా భూమేట సూర్యుడిచుట్టూ తిరుగుతూంట! విన్నారా? గిరగిరా!

అ—ఇదేమిటి! నమ్మకం ఇంతట్లో ఎల్లా మార్చుగున్నావు? మళ్లీ అప్పుడే భూమి గిరగిరా?

మే—అయ్యా! నా జీతం రాళ్లు నాలుగూ గిర గిరా తిరిగి వస్తూంటే నాకు చాలు.

అ—నాకూ అంతే.

మే—బాగా అన్నారు! మీ కడుపు చల్లగా! అల్లాంటప్పుడు దేంచుట్టూ ఎవరు తిరిగితే, ఎవడికొంప ఏం మునిగిపోయింది చెప్పండి. పైగా ఎవరిచుట్టూ ఎవరు తిరిగినా, లెక్కల్లో తేడాలుండవని మా పంచాంగం శాస్తుల్లుగారన్నాడు. మీతో నేను ఏకీభవిస్తూనే ఉన్నాను. గాని స్వల్పాల్లో నాతో పట్టింపులుపోకండి, ఊరిఖేను.

అ—సరే లెండి.

అని అధికారి రాయడం అభినయించి, తానిది వరకే రాసి గోప్యంగా తెచ్చిన కాగితపుముక్క ఒకటి పైకితీసి, అసలు రిపోర్టు తరవాత పంపుతాననిన్నీ అది ఎట్లా ఉండవచ్చునో మచ్చు చూపించుతున్నాననిన్నీ చెప్పి, తను ఈ సంగతులు మహా, అప్పుడేరాసినట్టు చదివాడు.

"మనోగణితము మోతాదు. లెక్కలు సుమారు. తెలుగు జబ్బు. నల్ల బల్ల నల్లగానూ లేదు, బల్లపరుపుగానూ లేదు అది ఘోరమరమ్మతు కోరెడిని. స్కూలులో స్వేచ్ఛదేశీయకసరకు సున్న. బోధనా పరికరములు శూన్యము. ఉక్తలేఖనము తప్పులకుప్ప. చూచివ్రాతలో శ్రద్ధ మిళితమైలేదు. చూచివ్రాతలో చూచుటయు,వ్రాయించుటయు, దిద్దుటయు ముఖ్యములు. చిత్రలేఖనము ఎంతైన వృద్ధికి జాగా ఒసంగుచున్నది. నేను, అందరికీ తెలిసిన విషయముగురించి, శమారమి, ఒక మాదిరి పాఠమిస్తిని. పిల్లలు పద్యములను అర్థమగునట్లు చదవకూడదు. గొంతెత్తి పాడవలెను. ఉపాధ్యాయుడు పిల్లలను పోగుచేసికొని వచ్చినట్లు కన్పింపదు."

మే—తమరు చదివిన వాటిల్లో చాలా ఇప్పుడు జరగనేలేదే?

అ—ఆమాత్రం నాకు తెలియకపోలేదు. నా ఉద్దేశం ఏమిటంటే,

ఒకవేళ అవికూడా జరిగి ఉంటే వాటి విమర్శ ఇల్లా ఇల్లా ఉంటుంది సుమా, కబడ్దార్, అని.

సరే పిల్లలకి రేపు సెలవనిచెప్పి పంపించెయ్యండి.

మే—చిత్తం. కొంచెం వీళ్లని ప్యాసుచేసి మరీ వెళ్లరూ?

అ—ఓ యెస్. సరే. పెద్దక్లాసు ఎందరూ?

మే—ముగ్గురు.

అ—సరే. ముగ్గురే గనుక అంతా ప్యాస్. చిన్న క్లాసు చాలా ఉన్నారా?

మే—మరేనండీ! చిక్కొచ్చిందీ!

అ—టీకాలు వీళ్లల్లో ఎవరికి లేవో, చెప్పండి!

మే—ఆ వీభూతి కుఱ్ఱాడికి లేవండి.

అ—ఇహ నేమ్మరీ! వాడు తప్ప చిన్న క్లాసంతా కుడా ప్యాస్!

పిల్లల్ని పంపించేసి, స్కూలు కట్టేసి, అంతా మేష్టరుగారి ఇల్లు జేరుకున్నారు. క్రమేణా చీకటి పడింది. అధికారి ఆవడల్ని పరామర్శచేశాడు. చేస్తూ, మేష్టర్ని పిల్చి, "నైట్‌స్కూలు గ్రాంటుకూడా మీరు లాగుతూన్నట్టున్నారు. నైట్ స్కూలికి పదండి చూద్దాం" అన్నాడు. అందుకు, మేష్టరు, "చిత్తం. నైట్‌స్కూలు ఏదీ అని అడిగితే ఓటి చెప్తాను వినండి. నైట్‌స్కూలనే పదార్థం తమ కటాక్షవీక్షణంతో కూడుకుని ఉండేదే గాని వేరే ఉంటుందని చూస్తున్నారా యేమిటి? ఇప్పుడు తమరు దయచేయ్యగా ఈ పగటిస్కూలు నివేదించుగున్నాడా, ఈ విధేయుడు! ఈ మాటు తమరు వేంచేసినప్పుడు అక్కడికి ఆ కాస్తమాటా దక్కించుకుని ఆ నైట్‌స్కూలుని కూడా తమ ఎదట దాఖలుచేసుగుంటాడు!" అంటూ విధేయతతో దాటుకున్నాడు. అధికారి బేవ్ మని త్రేణ్చి చిరునవ్వునవ్వి, "ఈ మాట తప్పకండి"

అని హెచ్చరించాడు. మేష్టరు నాలిక కరుచుకుని "అంతే! సెబాసు" అన్నాడు.

మరికాస్సేపటికి మేష్టరు అధికారి దగ్గిరికి వెళ్లి "ఇక నేను పడక 'అరణ్యామెంటు' చేస్తాను" అన్నాడు. తక్షణం భంట్రోతు వెంకటాయిని వీధులోకి పిల్చుకుపోయి కొంతసేపు చెవిలో ఏదో ఉపదేశించాడు. వెంకటాయిగారు, "తప్పుతుంది బాబూ; అల్లానే!" అన్నాడు. భంట్రోతు "తొమ్మిది దాటకూడదు. దాటితే మళ్లీ పంతులుగారికి భయం. భయం అంటే మనుష్యుల్ని గురించి కాదు. పురుగూ బూటా ఉంటుం దని!" అన్నాడు. వెంకటాయిగారు, "అల్లాగే వెళ్లివస్తా!" అని కండువా వేసుగుని ఎక్కడికో వెళ్లాడు.

ఆయన వచ్చేసరికి వీళ్లు లేరు. నిద్రపోతూన్న కొడుకుని లేపి వెంకటాయిగారు అడగగా వాడు ఏమీ ఎరగనన్నాడు. ముసలమ్మ సమాధానం గ్రహించే సరికి తెల్లారుతుందేమో అని భయమేసి వెంకటాయిగారు ఆవిణ్ణి అడగనేలేదు. ఆరాత్రి వెంకటాయిగారికి నిద్రపట్టలేదు.

మర్నాడు టపాలో వెంకటాయిగారికి మరి నాలుగు రోజుల్లో ఆ స్కూలికి తణిఖీతంతు జరుగుతుంది గనక సిద్ధముగా ఉండవలసిందని అసలు అధికారి దగ్గిర్నించి ఉత్తరం వచ్చింది!

పసిపిల్ల

చిఱ్ఱావూరి కామేశ్వరరావు గారు

వనజదళమున మకరంద కణమువోలె
శుభ్ర గగనాంగణంబునఁ జుక్కవోలె
తల్లియొడిలోనఁగల పసిపిల్ల, నిన్నుఁ
గనుఁగొనంగ సంతోషము గలుగునేల?

తల్లిముఖమును జూచి సంఫుల్లవదన
వై పకపక నవ్వెదవు నిరంతరముగ!
అందు నూతనసోయగ మరసెదో? సు
ఖాలయముఁ గాంచెదో? మఱేమైనఁ గనెదొ?

జీవనంబను నిద్దురఁ జెంది, మృత్యు
దేవతానికేతన శోభ దెలియలేక
మెలఁగెదము మేము;—విందవై మేదినీవ
లయమున కరుదెంచితివి విలాసగతి వి

నూతనముగ మధుర మాసనాతనాల
య సుఖసంపదలు స్మరించి యలరు గుత్తి
వోలె మురువుగ నవ్వెదవో? ప్రపంచ
మను విశాల నాటకశాలఁ గనిన కతనఁ

బలుకనేరని యానందభావ మనుభ
వించెదో?—అనిమిత్తము లెంచరాని
హేయవిభ్రాంత కష్టసుఖాయుతములు
నగుమనోగతము లెఱుఁగమి,నరిదికుతుక (?)

మొలుకు తీయని నగవులు వెలుఁగఁ జేసె
దో?—ఒకటియుఁ గాకుండిన నుజ్జ్వలం బ
మలమహానందభరితనిశ్చలగుణంబు
పుణ్యమగు నాదికారణ మూర్తివేమొ!